# టేకిట్ ఈజీ



"హాయ్ సెక్సీ" అంటూ పలకరింపు వినబడితే కవిత తలతిప్పి చూసింది, 'ఎవఁడ్రా ఇంత చొరవగా పలకరించేది?' అనుకుంటూ.

చూడగానే గుర్తు పట్టింది. 'టీవీలో 'టేకిట్ ఈజీ' ప్రోగ్రాంలో కనబడే కుర్రాడు. దానిలో ఇలా రోడ్డుమీద హఠాత్తుగా మనుష్యుల్ని పలకరించి హడావుడి పెట్టి వాళ్ల నోట్టి వెఱ్రిపీనుగులుగా చూపిస్తాడితను. ఆ ప్రోగ్రాం చూసి తను చాలా సార్లు అనుకుంది, అనూహ్యాపరిస్థితు లెదురైనప్పుడు మనుష్యులంత యిదిగా బిత్తరపోతారెందుకురా? అని. అనుకోకుండా తనే చిక్కుకుం దీనాడు. లక్షలాది టీవీ ప్రేక్షకులు ఎదురుచూస్తూంటారు – తనెలా బెదిరిపోతుందా, తబ్బిబ్బు పడుతుందా నని. తనే మాత్రం చెక్కు చెదరదని నిరూపించుకోవాలి.'

"హాయ్, హాండ్‌సమ్" అంటూ చెయ్యూపింది కవిత.

ఆ అబ్బాయి మొహం విప్పారింది.

ఎమ్బీయస్ ప్రసాద్

'ప్రోగ్రాం రంజుగా ఉండబోతోందని సంబరపడుతున్నాడు కాబోలు. మామూలుగా తత్తరపడుతూ కనబడేవాళ్లలా కాకుండా విభిన్నంగా కనబడినందుకు సంతోషమేమో. చూస్తూండమను. తనే ఒక ఆట ఆడిస్తుందతన్ని.

"సెక్సీ అమ్మాయి పేరు కూడా సెక్సీగా ఉంటుందా?" అంటున్నాడు హుషారుగా. మాటల్లో కొంటెతనం మహ గుప్పించేస్తున్నాడు. టీవీలో మొహానికి, బయట కనబడే మొహానికి కాస్త తేడా ఉంది. బయటే బాగున్నాడు.

"పేరు డబుల్ సెక్సీగా ఉంటుంది. మీరు ఊహించి చెప్పండి చూద్దాం" అంది కవిత చమత్కారంలో నీకేమీ తీసిపోను సుమా అని చూపడానికి.

అతను తల వంచుకుని ఆలోచిస్తూండగా చుట్టూ పరికించింది, కెమెరా ఎక్కడ పెట్టారా అని. 'అయినా ఈ టాంక్‌బండ్ మీద ఇంత ఖాళీ స్థలంలో కెమెరా ఎలా దాచగలరబ్బా?'

"...మోహిని?" అన్నాడా అబ్బాయి కాస్సేపటికి తలెత్తి.

"కాదు, ఇంకో ఛాన్స్ ఇస్తున్నా" అంది కన్నుగొడుతూ.

'కెమెరా ఎక్కడుందో తెలిస్తే బాగుణ్ను. కెమెరా కేసి చూసే కన్ను కొట్టవచ్చు. ఫోటోగ్రాఫర్ తెల్లబోతాడు. 'ఈ పిల్లెవర్రా బాబూ, మన కంటె నాలుగాకులు ఎక్కువ చదివిందే' అని.

"...రూపిణి."

"నిల్చోబెట్టే మాట్లాడతారా?" అంది చిలిపితనం ఒలకబోస్తూ.

"సారీ, సారీ.. రండి. ఆ బెంచీ మీద కూచుందాం" అన్నాడతను కవితను పక్కన ఉండి నడిపిస్తూ.

'ఆ బెంచీకి నడిపిస్తున్నాడంటే అది కూడా కెమెరా వ్యూలో ఉందన్నమాట. దూరంగా కనబడుతున్న ఫ్లాట్స్‌లో పెట్టి జూమ్ చేస్తున్నారా?' అనుకోసాగింది కవిత, ఆ అబ్బాయి చేస్తున్న రొమాంటిక్ సంభాషణకు ఏ మాత్రం తీసిపోకుండా జవాబులు చెబుతూనే.

ఇద్దరూ పక్కపక్కన తగిలేలా కూచున్నాక కుర్రాడు హుషారు పెంచాడు. కవిత కూడా రెచ్చిపోయింది. 'సాధారణంగా టీవీ ప్రేక్షకులు ఈ ప్రోగ్రాంలో కనబడేవాళ్లని బలిపశువుల్లా చూసి జాలిపడతారు. ఇవాళ వాళ్లు తన తెగువ చూసి చప్పట్లు చరవాల్సిందే. తన ఫ్రెండ్సంతా మతులు పోగొట్టుకుని 'అంత నిబ్బరంగా ఎలా ఉన్నావే, మాకయితే మాత్రం కాళ్లూ, చేతులూ ఆడివుండేవి కావు' అంటూ తనను అభినందించేస్తారు. అప్పుడు కొట్టాలి పోజు...'

ఆ అబ్బాయి అటూ, ఇటూ చూసి చటుక్కున బెంచీ మీదనున్న చేతిని కవిత తల వెనకకు పోనిచ్చి పెదాలందుకుని గాఢంగా ముద్దు పెట్టుకోడంతో ఆమె ఆలోచనలకు అడ్డుకట్ట పడింది.

ఆమె బిత్తరపోయి, మూతి తుడుచుకుంటూ "ఏయ్, కెమెరాలో ఇది కూడా పడితే?" అని కోపం తెచ్చుకుంది. "మా అమ్మా, నాన్నా ప్రతీవారం ఈ ప్రోగ్రాం చూస్తారు తెలుసా?"

"కెమెరా ఏమిటి? ప్రోగ్రాం ఏమిటి? ఇక్కడ దగ్గర్లో ఎవరూ లేరు. అందుకే..." అన్నాడతను తికమకపడుతూ.

"నాకు తెలుసులే. వేషాలేయకు. టేకిట్ ఈజీ ప్రోగ్రాం కదూ ఇది? నన్ను బురిడీ కొట్టించాలని చూడకు. నాకన్నీ తెలుసు."

"ఆ ప్రోగ్రాంతో నాకేం సంబంధం? అయినా ఇది ప్రోగ్రామేమిటి?"

"చూడు మిస్టర్, నా కన్నీ తెలుసు. ఇలా బుకాయించడం కూడా కొన్ని ఎపిసోడ్స్‌లో చూసా. నువ్వు 'టేకిట్ ఈజీ'లో కనబడే ప్రదీప్‌వని చూడగానే గుర్తుపట్టేసా."

"ఛ, ఛ. నేను ప్రదీప్‌నేమిటి? వాడు నాకు కజినవుతాడు. నేను మోహన్రావని... ఇంజనీరింగు చేస్తున్నాను."

"ఆఁ, పచ్చి మోసం.. ప్రోగ్రామనుకుని ఇంత దూరం వస్తే..." ఆ పైన ఏమనాలో తెలియక కవిత ఆగిపోయింది.

అతని మొహం వివర్ణమైంది. "ప్రోగ్రాం అనుకుని ఇంత రెస్పాన్స్ ఇచ్చారా? అదీ సంగతి. లేకపోతే నా మొఖానికి... ఇంత అందమైన అమ్మాయి... అంత భాగ్యమా?" అన్నాడు తలవంచుకుని.

ఆమె సిగ్గుపడింది. తన ప్రవర్తన సమీక్షించుకుంటే తనదే తప్పనిపించింది. ఓదార్పుగా "అలా అనకండి. మీ మొహం బాగానే ఉంది. కానీ... నేనే... జస్ట్ డిజప్పాయింట్‌మెంట్... చెప్పాలంటే తొలిముద్దనేది ఎంతో మధురంగా ఉండాలని కలగన్నాను. కానీ ఇలా కన్‌ఫ్యూజన్లో జరగడం నాకు బాధగా ఉంది. అందుకనే అలా..."

"ఆ మాటకొస్తే నాకూ అది తొలిముద్దే. ఇలా నా మీద అభిమానం లేని వ్యక్తితో.. పొరపాటు అభిప్రాయంతో... అలా జరగడం నాకూ బాధగానే ఉంది."

ఇద్దరూ కాస్సేపు మౌనంగా ఒకరినొకరు చూసుకున్నారు. 'కుర్రాడు మంచివాడే' అనుకుందామె. 'బాగున్నాడు' అని కూడా అనుకుంది. తన చెయ్యి అందుకుని గాజులు సవరిస్తూంటే చూస్తూ కూచుంది.

అతను గొంతు సవరించుకుని, "నేనో సలహా చెప్తాను. నచ్చితే చెప్పండి. మన తొలిముద్దు ఇలా జరగడం ఇద్దరికీ బాగాలేదు కదా, అది ఆకాశానికి ఇచ్చేమనుకుందాం. ఈసారి సరిగ్గా, మనస్ఫూర్తిగా పెట్టుకుందాం, సరేనా?" అన్నాడు. ఆమె తలవూపింది.

ఇద్దరూ గాఢ పరిష్వంగంలోంచి, ప్రగాఢ చుంబనంలోంచి బయటపడ్డాక ఆమె "ఇది భూమాత కిచ్చేశాం అనుకుందాం. ఈసారిది తొలిముద్దనుకుందాం" అంటూ అతన్ని మళ్లీ దగ్గరకు లాక్కుంది.

●

(ఆంధ్రప్రభ వీక్లీ జూన్ 1998)